


ముద్దంశెట్టి హనుమంతరావు

డాక్టర్ రామచంద్ర, ఆఫీసుగదిలో కూచుని క్లిష్టమైన ఒక కేసును స్టడీ చేస్తున్నాడు. బైట యేదో కోలాహలం వినిపించగానే, యేమిటోనని సాలోచనగా తలెత్తాడు. తను గదిలో వుండి, అలా ఆసక్తితో చూడ్డంలో అర్థం లేదనుకుని, నవ్వుకున్నాడు.

అప్పుడే ఒకవ్యక్తి లోపలికి వచ్చాడు.

"నమస్కారం డాక్టరుగారూ! ఎవరో ఒక యువకుడు కారుక్రింద పడ్డాడండీ పాపం! బలంగా తలమీద గాయం తగిలిందేమో, స్పృహతప్పాడు. ఇక్కడికే తీసుకొచ్చాం. త్వరగా వచ్చి, పరీక్ష చెయ్యండి సార్," అన్నా డతను.

"పదండి..." డాక్టర్ రామచంద్ర అతనితో బైటికి వచ్చాడు.

మధ్య హాల్లో ఓ బెంచీమీద స్పృహ తప్పి పడుకున్నా డా యువకుడు. రామచంద్ర పరీక్షించాడు. పల్స్ బాగానే ఉంది. ఫరవాలేదనిపించింది.

"ఇతని తాలూకువాళ్ళు యెవరన్నా వున్నారా?"

"లేరండీ; పాపం, యెవరో కొత్త మనిషిలా వున్నాడు. ప్రమాదం జరగడమే తడవుగా, తప్పించుకుని కారుని తీసుకుపోయాడు డ్రైవరు. కారునెంబరు

డాక్టరుగారు రోజుకో గ్లాజు కాఫీయే తాగమన్నారు



తీసుకుందుకూ్కడా యెవరికీ అవకాశం లేకపోయింది;" జవాబిచ్చాడు వ్యక్తి.

డాక్టర్ రామచంద్ర ఆలోచించాడు. డాక్టరుగా తన కర్తవ్యం యెలావున్నా, ప్రస్తుతం అతడ్ని తనవద్ద 'ట్రీట్‌మెంటుకి' పెడితే, కనీసం పదిహేను రోజులయినా పడుతుంది నయమవ్వడానికి. తన ఫీజుమాట అటుంచితే, ఖర్చంతా తనే భరించుకోవాలి. అంటే తన హాస్పటలు ధర్మాసుపత్రిగా మారిపోయే అవకాశం యెప్పటికైనా తటస్థించవచ్చు - యిటువంటి కేసులు చేపడితే. ఒకవేపు ఆ యువకుడిపై జాలి, సానుభూతి, కలుగుతున్నాయి. కాని, మరోప్రక్క, తనది ధర్మాసుపత్రి కాదన్న విషయం గుర్తుకొస్తోంది. అసలే యిప్పుడు స్టాఫ్ పేమెంటు అధికం చేసి, అలా చేసినందుకు యిప్పుడిప్పుడే పశ్చాత్తాప పడుతున్నాడుకూడా. కాని యేం చెయ్యగలడు? ఈ పరిస్థితుల్లో కనికరం పేరుతో, సానుభూతి సాకుతో, వుచితవైద్యం చెయ్యలేడు. ఒకసారి అలవాటు చేసుకుంటే, దాన్ని తప్పించుకోవడం తర్వాత కష్టతర మౌతుందేమోనన్న భయమూ మొలకెత్తిందతనిలో. అందుకే ప్రస్తుతానికి ఆ కేసును తప్పించుకోవాలనుకున్నాడు. పేషెంటుకి పెద్దప్రమాదమంటూ యేమీ లేదుగాబట్టి, యేదో ఒహటి చెప్పేసి, అప్పటికి తను కర్తవ్య విముక్తుడు కావడం మంచిది.

"కారు మాటకేంలెండి గాని, ప్రస్తుతము యితనికి ఆపరేషన్ చెయ్యాలి. ఇప్పుడు నా డిస్పెన్సరీలో బెడ్ ఖాళీగా లేదు. వెంటనే గవర్నమెంట్ హాస్పటల్‌కి తీసుకెళ్ళడం శ్రేయోదాయకం," అన్నాడు డాక్టర్.

అక్కడ చేరినవారు ఆయోమయంగా మొహాలు చూసుకున్నారు.

"మీ రలా అంటే ఎట్లాసార్: ఇతని పరిస్థితి చూస్తూ, ఎలా అనగలిగారలా?" అన్నా డొకాయన.

"ఏం చెయ్యనండీ! నా అసహాయత చెప్పుకున్నాను కదా! అయినా మీరు వూహించినంత ప్రమాదం యేమీ లేదు లెండి. అవసరమైతే ఆపరేషను చెయ్యాలనుకోండి. ఆపరేషను చేశాక, నే నీయన్ని యెక్కడ వుంచుతాను? అందుకే ముందుగా చెప్తున్నాను... ఈ వూళ్ళో వీళ్ళవాళ్ళెవరైనా వుంటే, కబురుచేసి, గవర్నమెంటు హాస్పటల్లో చేర్చడం మంచిది... అంతదనుక నేను ప్రథమచికిత్స యేదో చేస్తాను."

"ఎవరున్నారో, ఏమో, మాకు మాత్రం ఏం తెలుసునండీ?" అని ఒక వ్యక్తి అంటుంటే, మరొకాయన కాస్త ముందుకువచ్చి "ఈయన పడివున్న చోట యీ కవరు - దొరికిందండీ!" అంటూ ఒక కవరు అందించాడు.

డాక్టర్ రామచంద్ర ఆ కవరును పరిశీలనగా క్షణం చూశాడు. అంటించి వుందిగానీ, దానిమీద యే విధమైన అడ్రసూ లేదు. అది చిత్రంగా కనిపించిందతనికి. ఆ విచిత్రమేమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి అతనిలో వురకలు వేసింది. ఆ వుత్తరంద్వారా అతనికి సంబంధించినవారి అడ్రసు యేదేనా దొరికితే, సమస్య పరిష్కార మవుతుందనుకుంటూ, కవరు చించాడు. ఉత్తరం చదవడం ప్రారంభించేసరికి, అతనికి కళ్ళు తిరిగినట్టయ్యాయి. ఇంత మొండి గుండెవాడూ, యిన్నేళ్ళ అనుభవశాలీ కూడా చలించిపోయాడు. క్రింది సంతకముమీదికి అతని దృష్టి మరలింది అప్రయత్నంగా. కమల!... రామచంద్ర శరీరం ముచ్చెమటలు పోసింది. కమల అతని కళ్ళముందు లీలగా మెదిలింది. ఉత్తరం చదవడానికి వుపక్రమించాడు ఆసక్తితో.

"డాక్టరు రామచంద్రగారికి,


నమస్కారాలు,

ఇలా నేను సంబోధించడానికి, అనేక కారణాలున్నాయి.

మీరు యిప్పుడెక్కడో ఓచోట డాక్టరుగా హాయిగా వుంటారని నాకు తెలుసు. కాని, నిర్ణీత స్థలం మాత్రం తెలీలేదు ఇన్నాళ్ళూ. మీరు విజయవాడలో వుంటున్నట్టు మొన్ననే తెలిసింది. ఇన్నాళ్ళకు మీ వునికి తెలిసినందుకు, నే నెంతగానో మురిసిపోయాను. వెంటనే బైలుదేరి రావాలనుకున్నాను. కాని, నా అంతరాత్మ అంగీకరించలేదు. అందుకే స్వయంగా వచ్చి, మీ కళ్ళెదుట పడ్డం యిష్టంలేక పోయింది.

ఇన్నేళ్ళూ, నేను యెలా కాలం గడిపానో, మీరూ వూహించలేరు. ఆ పరమాత్ముడికే తెలుసు. నా చదువే, నన్నూ

నా బాబునీ రక్షించిందని చెప్పాలి. ప్రస్తుతానికి ఒక స్కూల్లో పంతులమ్మగ వున్నాను. అలాగే అబ్బాయిని యింతవాణ్ణి చేశాను. ఇప్పుడు వాడు బి. యస్‌సి. పాస య్యాడు. మెడిసిన్ చదువుతానంటూ మొరాయించు కూర్చున్నాడు. వాడి ఆసక్తి వాడిదేగాని, పరిస్థితులు అర్థం చేసుకోడు. మెడిసిన్ చదివించే తాహతు నాకులేదు. అది వాడికి తెలిసినా, చదువు మీదుండే ఆసక్తి, దాన్ని విస్మరింప జేస్తుంది. ఇప్పుడు నేను యేం చెయ్యాలీ, అన్న సమస్యతో కొట్టుమిట్టాడుకు పోతున్న తరుణంలో మీవునికి తెలిసింది. బహుశా యిది దైవేచ్ఛే అనుకుంటాను. అందుకే, వాణ్ణి మీదగ్గరకు పంపు తున్నాను. ఇన్నాళ్ళూ నా బాధ్యత నేను నెరవేర్చాను. ఇక వాడి బాధ్యత మీరే నెత్తిన వేసుకుంటే, వాడి భవిష్యత్తు పూలబాట అవుతుందన్న ఆశ వుంది. ప్రస్తుతం మీ వివరాలేమీ నాకు తెలీవు. మీ సంసారజీవితం ప్రసక్తి నాకు అనవ సరం. నేనిప్పుడు కోరుకుంటున్న దేవిటంటే, తండ్రిగా వాడిపట్ల మీ కర్త వ్యాన్ని నెరవేర్చుకోండి. వాడికి అంతా చెప్పేశాను. దాచి, లాభమేముంది చెప్పండి? ఎప్పటికయినా తెలియాల్సిందేగా? అయితే, ఒక్క విషయం—మీరు నన్ను మర్చిపోయారన్న నిజంమాత్రం వెల్లడి చెయ్యలేదు. మన యెడబాటుకి కొన్ని కారణా లున్నాయని, కట్టుకథ ల్లి చెప్పాను. ఈ వుత్త రాన్ని వాడు చదవడులెండి. అటువంటి సభ్యత వాడి




రక్తంలో జీర్ణించుకుపోయివుంది. వాడి మంచితనం, క్రమశిక్షణా, తెలివి తేటలూ, యివన్నీ చూస్తుంటే, వాడికి వుజ్జ్వల భవిష్యత్తు వుందనిపిస్తుంది. అది నా స్వప్నమే కావచ్చు. అయితే, ఆ స్వప్నాన్ని మీరు నిజం చెయ్యాలి. అదృష్టంవుండి, పరిస్థితు లనుకూలిస్తే, కలుసుకుందాం. ఇట్లు-

మీ — కమల"

డాక్టర్ రామచంద్ర మొహంలో, యెన్నోరంగులు మారాయి. అతని అంతరంగంలో అసంఖ్యాకమైన ఆలోచనలు అలల్లా లేచిపడుతున్నాయి. గతస్మృతులు, లీలగా అతని కళ్ళముందు కదలాడసాగాయి. చేతిలోని వుత్తరం కేసి క్షణం మౌనంగా చూస్తూ, బెంచీ మీదున్న యువకునివేపు దృష్టిని సారించాడు. చిన్నప్పటి తనరూపం గుర్తుకొచ్చింది. నిజంగా అంతవరకూ, తను వాణ్ణి యెందుకు గుర్తుపట్టలేకపోయాడో, ఆశ్చర్యమేసిందతనికి.

దాదాపు యిరవై యేళ్ళు దాటిన తర్వాత, తనకు కమల మళ్ళీ గుర్తుకు రావడం, అతనికి కొత్త వుత్సాహాన్ని రేకెత్తించింది. అదే సమయంలో బాధపడ్డాడు కూడాను. కమల రాసినట్టు తను ఆమెను మర్చిపోలేదు నిజానికి. తను వూహించని పరిస్థితులు తటస్థించి, కమలను తనకి దూరం చేశాయి. అయితే, ఆ నిజాన్ని కమల గ్రహించడం యెలా?

అప్పట్లో కమల తనని దైవసమానంగా ఆరాధించేది. తను ఆమెను ప్రేమదేవతగా గుర్తించేవాడు. అలా గుర్తించడమే గాకుండా, తన ప్రేమను శాశ్వతం చేసుకుందుకు పెళ్ళి చేసుకుంటానని హామీ యివ్వడమేగాకుండా, దేవాలయంలో దేవుని సన్నిధిలో ఆమె మెళ్ళో పూలహారం వేసి, తన మాట నిలబెట్టుకున్నాడు. ఆరోజు కమల పొందిన ఆనందానుభూతి యిప్పటికీ తనకి గుర్తుంది. తమ మనసులు ఒకటయ్యాయి. ఇరువురూ విచ్చలవిడిగా తిరిగారు. ఆడారు...పాడారు. కాని, కాలం తమ ఆనందాన్ని గ్రహించలేకపోయింది. తమ ఆనందానికి అగాధంలా అడ్డొచ్చింది, తన బదిలీ. తను ఆవూరు విడిచి వెళ్ళడం, తప్పనిసరి అయ్యింది. ఆరోజు మరపురానిరోజు ... అదో చెడ్డరోజు ... కమల యెంతగానో విలపించింది. భయంతో వణికిపోయింది. అప్పటి కామె గర్భిణీ. తన గతేమవ్వాలని వాపోయింది. ఆమె భయాన్నీ, అధైర్యాన్నీ, పటాపంచలుచేసి, యెన్నో వాగ్దానాలతో, యెన్నో అభయాలతో, ఆమెను నమ్మించాడు. ధైర్యం చెప్పాడు. పదిపదిహేనురోజుల్లో వచ్చి తీసుకువెళ్తానన్నాడు. తనమాటలు ఆమె సంపూర్ణంగా నమ్మింది. తనపట్ల ఆమెకి ఆ గౌరవభావం వుందిమరి: అందుకే నమ్మింది.




కాని ... కాని ... అలా జరగలేదు. ఎందుకు జరగలేదో యిప్పుడు తల్చుకుంటే, మనసుని రంపపుకోత పెడతాయి ఆ ఆలోచనలన్నీను. నిజానికి తను ఆమెను తీసుకురావాలనే అనుకున్నాడు. కాని, యీలోగా తను బొంబాయి వెళ్ళాల్సివచ్చింది. అక్కడ వూపిరిసలపని పనులు...అక్కణ్ణించే విదేశాలకు వెళ్ళే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని జారవిడుచుకోవద్దని చాలామంది శ్రేయోభిలాషులు చెప్పారు. తనకూ అలాగే అన్పించింది. ఎదురుగా కనిపిస్తున్న వుజ్జ్వల భవిష్యత్తును, చేజేతులా యెవరు జారవిడుచుకుంటారు?

తన పరిస్థితుల్ని వివరంగా కమలకి తెలియజెయ్యాలనుకున్నాడు. కాని, ఆమె అడ్రసు తెలీదు. వెళ్ళి, ఆమెను కలుసుకుందుకు వీలుచిక్కలేదు. వ్యవధి అతి తక్కువ. ఆమె యెంతగా బాధపడుతోందో, యెంతగా కుమిలిపోతోందో, తనకే తెలుసు. కాని, యేంచెయ్యగలడు?...తనూ బాధపడ్డాడు. కమల యెలావుందో, ఏవిటో ననే దిగులు తనలోనూ వుండేది. ఈ కలవరపాటు చాలారోజులవరకూ తనలోంచి అంతరించలేదు. విదేశాల్లో వుండికూడా అదే అనుభూతినీ, ఆవేదననూ పొందేవాడు.

మూడు సంవత్సరాల తర్వాత తను భారతదేశానికి తిరిగివచ్చాడు. బొంబాయిలో అడుగుపెడుతూనే, తను జ్ఞప్తికి

తెచ్చుకున్న వ్యక్తి కమల! అయితే ఆమెను యెలా కలుసుకోవడం?...కొద్ది రోజులతర్వాత ఆమెకోసం ప్రయత్నించాడు. ఆమె వూళ్ళో లేదని తెలుసుకున్నాక, బాధపడ్డాడు. ఆమె యిప్పుడేమయ్యిందో, యెక్కడుందో; అప్పట్లో ఆమెలో పెరుగుతూవుండే తన ప్రతిరూపం యేమయ్యిందో వూహించుకోవడమే కష్టతరమయ్యింది. అవ్యక్తావేదన అనుభవించాడు. అంతే! క్రమముగా ఆమెను మర్చిపోయాడు. అయితే, గతస్మృతులు తనని వివాహం చేసుకోనివ్వలేదు. ఎన్నో విధాల జీవితాన్ని అనుభవిస్తూ హాయిగా కాలం గడుపుతున్నాడు తను. ఈనాడు యిలా కమల గుర్తుకొస్తుందని, తన కొడుకే తనెదుట పేషెంటుగా పడుంటాడని, యెప్పుడూ అనుకోలేదు...!

డాక్టర్ రామచంద్ర వుత్తరం చదువుతూ ఆలోచనల్లోపడ్డం, అక్కడున్నవాళ్ళందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఆయన. ఖచ్చితమైన నిర్మోహమాటపు మనిషని ప్రతీతి. అటువంటివ్యక్తి, అలా ఆలోచనల్లోపడ్డం, యేదో విశేషం వుండడంవల్లనే ననిపించింది.

"డాక్టరుగారూ! ఏమన్నా తెలిసిందాండీ," వుత్తరాన్ని అందించినవ్యక్తే, ఆసక్తితో అడిగాడు.

"తెలిసిందండీ! వారికి నేను వుత్తరం రాస్తాను..." వుత్తరాన్ని జెబులోపెట్టుకున్నాడు డాక్టర్ రామచంద్ర.

"అయితే, యీయన్ని గవర్నమెంటు హాస్పటల్‌కి తీసుకు వెళ్ళమంటారా?" ఓ ఆసామి ప్రశ్నించాడు.

డాక్టర్ రామచంద్ర గట్టిగా ఒక నిట్టూర్పు వదిలాడు.

"సరే, మీరంతా యింత జాలిగా చెబుతున్నారు గాబట్టి, యేదో ఒక యేర్పాటు చేస్తాలెండి,'' అంటూ నర్స్‌ని కేకవేశాడు.


నర్స్ ఆతృతగా వచ్చింది.

"Yes Sir..." సవినయంగా నుంచుంది.

"నర్స్! యీ వ్యక్తిని ఆపరేషన్ రూమ్‌కి తీసుకువెళ్ళే యేర్పాటు చెయ్యి. క్విక్..." అన్నాడు డాక్టర్.

నర్స్ వడివడిగా వెళ్ళి స్ట్రెచర్ యేర్పాటుచేసింది.

"ముక్కూ, మొహం తెలియని యీ అబ్బాయిపట్ల మీరంతా విశేషాభిమానం కనబరుస్తూవున్న యీ తరుణంలో, నిజంగా బెడ్ ఖాళీలేకపోయినా, ఆ విషయాన్ని చెప్పడానికి నాకే సిగ్గనిపిస్తోంది. అందుకే, మనసు మార్చుకున్నాను. ఏదో యేర్పాటు చెయ్యమని, నా అంతరాత్మ ప్రబోధిస్తోంది. థాంక్స్. మీరు వెళ్ళం డిక," అంటూ, తన మానవతను వ్యక్తం చేసుకున్నాడు డాక్టర్ రామచంద్ర.




ఈలోగా నర్స్ పేషెంటుని ఆపరేషన్ రూమ్‌కి తీసుకువెళ్ళింది. రామచంద్ర, ఆపరేషన్ రూమ్ కేసి నడిచాడు

డాక్టర్ మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేక, గుసగుసలు ప్రారంభించారు.

"డాక్టరుగారి ప్రవర్తన తమాషాగా వుందే! మొదట్లో బెడ్ ఖాళీలేదని చెప్పినవ్యక్తి, ఆ వుత్తరం చదవడంతో మనసు మార్చుకుని, బెడ్ యివ్వడానికి అంగీకరించాడంటే, ఆ వుత్తరంలో యేముందో?"

"ఏదో విశేషం వుండివుంటుంది. లేకపోతే, యింత అకస్మాత్తుగా ఆయన నిర్ణయం మారిపోదు. బహుశా ఆ వుత్తరం రాసినవ్యక్తి ఆయనకి సుపరిచితుడో యేమిటో!"

"ఏదో అయ్యుంటుందిలే! ఏదో విశేషమో, లేక స్వార్థమో వుండకపోతే, హఠాత్తుగా యిటువంటి మార్పు రాదు."

"పోనిద్దురూ. అవన్నీ మనకెందుకు? మన విధి మనం నిర్వర్తించాం. అదే మనకి తృప్తి... ఒక విధంగా చూస్తే, ఆ అబ్బాయి అదృష్టవంతుడు. ఇక మనం పోదాం పదండి..."

ఇలా తలొకరూ అభిప్రాయాల్ని వెలిబుచ్చాక యెవరిత్రోవన వాళ్ళు పోయారు.

* * *

డాక్టర్ రామచంద్ర ఆపరేషన్ రూమ్‌లో అడుగుపెట్టి, టేబిలుమీదున్న ఆ అబ్బాయిని పరిశీలనగా, తనివితీరా

చూస్తూ ఘురిసిపోయా డెంతగానో. చిన్న చిన్న గాయాలుంటే, ప్రథమచికిత్స స్వయంగా చేశాడు. అప్పటికే, ఆ యువకుడికి స్పృహ వచ్చినట్టయ్యింది.

"నర్స్! ఆపరేషన్ మరి అవసరములేదు. తలమీది గాయానికి కట్టుకట్టి, స్పెషల్‌వార్డులో బెడ్ యేర్పాటుచెయ్యి. స్పెషల్ కేర్ తీసుకోవాలి సుమా!"

"అలాగే సార్..."

డాక్టర్ రామచంద్ర తృప్తిగా అకక్రోణించి బైటపడి ఆఫీసు గదికేసి నడిచాడు.

డాక్టరుగారు ఆ వ్యక్తిపట్ల యెందుకంత శ్రద్ధాసక్తులు కనబరుస్తున్నారో, అర్ధంచేసుకోలేని నర్సు, కట్టుకట్టడంలో నిమగ్నురా లయ్యింది.

డాక్టర్ రామచంద్ర, హుషారుగా కుర్చీలో కూలబడ్డాడు. అతనిలో కొత్త వుత్సాహం, వెల్లివిరిసింది. ఇంతటి సంతోషాన్ని, వుత్సాహాన్ని, అతను విదేశాల్నుంచి తిరిగి వచ్చినప్పుడుకూడా పొందలేదంటే, ఆశ్చర్య మేమీలేదు. ఆ ఆనందానుభూతిలోనే నవ్వొచ్చింది.తనది యెంతస్వార్థం? తన ప్రవర్తనకి వాళ్ళంతా యే విధమైన అర్ధం చెప్పుకున్నారో యేవిటో! నిజానికి తన స్వార్థం విషయం వాళ్ళకి తెలీదు. తెలీక యేవేవో అభిప్రాయాల్ని స్థిరపర్చుకుంటారు, పాపం! ఈరోజు తను పొందుతున్న ఆనందం వారి కేం తెలుసు?

హుషారుగా ఓ సిగిరేట్ ముట్టించాడు. ఆ పొగపొరల్లో కమలరూపం లీలగా అగుపించింది. కమలని త నెప్పుడూ అన్యాయం చెయ్యలేదు కావాలని. కేవలము పరిస్థితులే ప్రాముఖ్యత వహించాయి తమ యెడబాటుకి. అందుకే, కమల తనని తప్పకుండా క్షమిస్తుంది. ఆ నమ్మకం తనకుంది...సిగరేట్ పొగ యింటికప్పును అందుకోడానికి పోతోంది...అబ్బాయి భవిష్యత్తు గుర్తుకొచ్చింది రామచంద్రకి. కొడుకును తనంతటివాడిగా చెయ్యాలి...అనుకున్నాడు. అతని జీవితంలో అదో సుదినం ... తృప్తిగా, నిండుగా నవ్వుకున్నాడు డాక్టర్ రామచంద్ర.